వైద్య శిబిరాలకు స్పందన


నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ కబీర్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌లో నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత డయాబెటిస్‌ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నీలిమ ఆసుపత్రి చైర్మన్‌ డాక్టర్‌ పి. శ్రీనివాసులు, డాక్టర్‌ నవీన్‌ చంద్రారెడ్డి మధుమేహం నియంత్రణకు అవసరమైన సూచనలు, సలహాలు చేశారు. అలాగే ఉచితంగా మందులు అందజేశారు.

స్నేహపురి కాలనీలో..

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వినోద్‌ యాదవ్‌ సూచించారు. కాలనీ వినాయక మండపం ఆవరణలో ఏజీఐ గ్రీన్‌ ప్యాక్‌, ఏజీఐ గ్లాస్‌ ఫ్యాక్టరీ, స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు బసవయ్య, మౌనిక రెడ్డి పర్యవేక్షణలో మధుమేహం, బీపీ, చర్మ, దంత, నేత్ర వైద్యంతో పాటు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఏజీఐ గ్లాస్‌ ఫ్యాక్టరీ సిబ్బంది నాయుడు, శ్రీనివాస్‌, స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఎస్‌ఎస్‌ఎం పిరాన్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వసీం పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ
- నవోదయ కాలనీలో 20 సీసీ కెమెరాల ప్రారంభం


నవోదయ కాలనీలో కాలనీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణ మరింత సాధ్యమవుతుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని నవోదయ కాలనీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల 80 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని, శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని, కాలనీవాసులకు విస్తృత ప్రచారంతో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని దీనిద్వారా కేసుల పరిష్కారం కూడా సులువవుతుందని, అన్ని కాలనీవాసులు ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అలాగే కాలనీల్లో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయిస్తానని చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీకాంత్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్‌, శర్మ, సంతోష్‌రావు, కాశీనాథ్‌ యాదవ్‌, కాలనీ అసోసియేషన్‌ సభ్యులు, నవోదయ కాలనీ ప్రెసిడెంట్‌ బి.వి. రమణ, వైస్‌ ప్రెసిడెంట్‌ రాజిరెడ్డి, సెక్రటరీ సిద్ధార్థ, గణేశ్‌, లక్ష్మణ్‌, శివశంకర్‌, స్వాతి, కల్యాణి, శ్రీలత, కావ్య, కవిత, వనిత, శివపార్వతి పాల్గొన్నారు.

బీజేపీ మహిళా మోర్చా సమావేశం



కూకట్‌పల్లి: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 28న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్‌ శిల్పారెడ్డి అధ్యక్షతన జిల్లా మహిళా మోర్చా నాయకులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమిత్‌షా కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో మేడ్చల్‌ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీశ్‌ రెడ్డి పాల్గొన్నారు.

జెండా దహనం: నిందితుల అరెస్టు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌లోని ఆటోస్టాండ్‌ వద్ద కాషాయ జెండాను దహనం చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన ఘటన అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు మెకానిక్‌లైన మహ్మద్‌ ఫరాజ్‌ (23), సయ్యద్‌ అబ్దుల్‌ షాబాజ్‌ అలియాస్‌ చోటు (28)ల అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా కాషాయ జెండాలను తగలబెట్టి గొడవలు సృష్టించాలని ప్రణాళిక వేశారు. దీంతో ఈ నెల 24న ఇద్దరూ బైక్‌పై పర్వత్‌నగర్‌ ప్రాంతానికి వచ్చారు. ఆటోస్టాండ్‌ రోడ్డు డివైడర్‌ మధ్యలోనున్న కాషాయ జెండాను దహనం చేసి పరారయ్యారు. అనంతరం ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. బాలానగర్‌ జోన్‌ డిసిపి టి. శ్రీనివాసారావు, కూకట్‌పల్లి ఏసిపి పి. శివభాస్కర్‌, ఎస్‌ఓటి సబ్‌ ఇన్‌స్పెక్టర్లు కిశోర్‌, సాయినాథ్‌, సిబ్బంది పర్యవేక్షణలో నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్స్‌ ఎండి మన్సూర్‌ ఆలం, లక్ష్మప్ప, జి. చిన్నయ్యను పోలీస్‌ కమిషనర్‌ అభినందించారు.

ప్రభుత్వ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీ సాయి విద్యానికేతన్‌ స్కూలు విద్యార్థులు


జాతీయ ఓటరు దినోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డా. అలివేలు మంగమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ డా. అలివేలు మంగమ్మ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కులం, మతం, వర్గం, ప్రాంతం, జాతి, భాష, డబ్బు తదితర ప్రభావాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యం, దేశ అభివృద్ధి అనేది మంచి ప్రభుత్వాలను ఎన్నుకున్నప్పుడే సాధ్యం అవుతుందన్నారు.అనంతరం విద్యార్థులకు భారత రాజ్యాంగ మౌలిక భావనలపై క్విజ్‌ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం అధికారులు జి. రవికుమార్‌, డా. కె. సాలయ్య, డా. ఐ. వాణి, వాణిజ్య విభాగాధిపతి ఆర్‌. కరుణ, ఆంగ్ల విభాగాధిపతి డా. ఆర్‌. శోభారాణి, డా. ఎం.ఎం. మాలిక్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సాయి విద్యానికేతన్‌ స్కూల్‌లో..


మూసాపేట: మూసాపేట ప్రగతినగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్‌ స్కూల్‌లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుతో పాఠశాల ఆవరణలో ఓటరు డే లోగోను వేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్‌ గార్లపాటి సత్యనారాయణ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మంచి పాలన కోసం, మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధం అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో మాక్‌ డ్రిల్‌



కూకట్‌పల్లి: నారాయణ పాఠశాలలో మాస్టర్‌ ఓ రేటర్‌ (మాక్‌) కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఐదో తరగతికి చెందిన నాలుగు నారాయణ విద్యా సంస్థల నుంచి సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొని భాషా పరిజ్ఞానాన్ని తమదైన శైలిలో కనబరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏజీఎం వైజయంతి, సాఫ్ట్‌ స్కిల్స్‌ తెలంగాణ హెడ్‌ గీతల పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ పరిధిలోని నారాయణ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్‌, కోఆర్డినేటర్లు, సాఫ్ట్‌ స్కిల్స్‌ రీజినల్‌ హెడ్‌ యేగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకాంబరిగా అమ్మవారు



మోతీనగర్‌: మూసాపేట మోతీనగర్‌లోని శంకరమఠంలో పుష్య పౌర్ణమి సందర్భంగా 51 రకాల కూరగాయలలో 50 కేజీలతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా శంకర మఠం కార్యనిర్వాహణాధికారి సిఎస్‌ఆర్‌ మూర్తి మాట్లాడుతూ యేటా రెండుసార్లు అమ్మవారికి కూరగాయలతో అలంకరించి శాకాంబరిగా భక్తులకు దర్శనమిస్తుందని తెలిపారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి


శేరి సతీశ్‌ రెడ్డిని కలిసిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కూకట్‌పల్లి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌ రెడ్డిని కేపీహెచ్‌బీ కాలనీ బాలాజీ ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరి సతీశ్‌ రెడ్డి కార్మికుల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలను కూకట్‌పల్లి కాంగ్రెస్‌ ఇన్‌చార్జి బండి రమేశ్‌ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కె. రవి, ఉపాధ్యాయులు ఎన్‌. శ్రీను, బి. బాలజీ, సెక్రటరీ కె. పరశురాం, జాయింట్‌ సెక్రటరీ కె. ఆదిబాబు, కే. షేక్‌, కోశాధికారి జి. గోపి, ఏ దుర్గారావు పాల్గొన్నారు.

కేలండర్‌ ఆవిష్కరణ


కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో కేలండర్‌ను ఆవిష్కరించిన డిఇఓ విజయకుమారి, ఉపాధ్యాయులు, నాయకులు

కూకట్‌పల్లి: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు వివిఎస్‌సిపిఎస్‌ శర్మ ఆధ్వర్యంలో ఆర్‌యుపిపి-టి 1927 నూతన సంవత్సర కేలండర్‌ను మేడ్చల్‌ డిఇఓ విజయకుమారి పాఠశాల ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. అదేవిధంగా జాతీయ ఓటరు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి పాఠశాల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వివిఎస్‌సిపిఎస్‌ శర్మ మాట్లాడుతూ భాషా పండితుల సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని డీఈవోను కోరారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ భాషా పండితుల ప్రమోషన్లు త్వరగా రావాలని కోరుకుంటున్నానని, ఆ దిశగా తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్‌ ఏఎంఓలు రవీందర రాజు, అయ్యన్న, డిసిఇబి సెక్రటరీ సురేశ్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గూడచారి, నరేందర్‌ రెడ్డి, ఆర్‌యుపిపి-టి రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షురాలు స్వప్న, జిల్లా ప్రధాన కార్యదర్శి రోహిత్‌ కుమార్‌, జిల్లా కార్యదర్శులు సాయిగీతిక, చంద్రశేఖర్‌, చంద్రశేఖర్‌ రెడ్డి, మాణిక్యం, కృష్ణయ్య, సహదేవ్‌, గీతాభవానీ, డార్కస్‌, శాంతి కుమారి పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డితో భేటీ

కూకట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్కనపల్లి సూర్యరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌ రెడ్డి రాబోయే పార్లమెంట్‌ ఎన్నికల్లో కార్యకర్తలతో మమేకమై పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలుపొందేలా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట రాష్ట్ర సీనియర్‌ నాయకులు ధర్మారావు చౌదరి, ఆసిరెడ్డి భూపాల్‌ రెడ్డి ఉన్నారు.

తాపీ మేస్త్రీల సంక్షేమానికి భారతీ సిమెంట్స్‌ పెద్దపీట

భారతీ సిమెంట్స్‌ టెక్నికల్‌ ఇంజినీర్‌ సాత్విక్‌రెడ్డి


తాపీ మేస్త్రీలకు ప్రమాద భీమా బాండ్లు, గిఫ్టలను అందజేస్తున్న సాత్విక్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: వ్యాపారంతో పాటు తాపీ మేస్త్రీల సంక్షేమానికి భారతీ సిమెంట్స్‌ యాజమాన్యం పెద్దపీట వేస్తోందని సంస్థ టెక్నికల్‌ ఇంజినీర్‌ సాత్విక్‌రెడ్డి అన్నారు. భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో 5స్టార్‌ గ్రేడ్‌ సిమెంట్‌ను కొత్తగా మార్కెట్‌లోకి విడుదల చేసిన నేపథ్యంలో గురువారం కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం దూలపల్లిలో జీఎంజే ట్రేడర్స్‌ వద్ద తాపీ మేస్త్రీలతో సమావేశమయ్యారు.

◆ ఈ సందర్భంగా సాత్విక్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర బ్రాండ్‌ల సిమెంట్‌తో పోలిస్తే భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. శ్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఇది సరైన ఎంపికని అన్నారు. శ్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన భారతీ సిమెంట్‌ ఇంజినీర్లు సైట్‌ వద్దకే వచ్చి సహాయపడవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా 40 మంది తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను, గిఫ్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్‌ శ్రీనివాస్‌ టెక్నికల్‌ ఆఫీసర్‌ నరసింహులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్‌: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గండిమైసమ్మ దుండిగల్‌ మండల తహసీల్దార్‌ సుచరిత అన్నారు. మండల పరిధి మల్లంపేటలోని సర్వే నం .170, ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. సుచరిత ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ భారతీదేవి 13 ఇళ్లు, ఐదు బేస్‌మెంట్లను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరోసారి నిర్మాణాలు చేపడితే ల్యాండ్‌ గ్రాబింగ్‌ కేసులు నమోదు చేస్తామని సుచరిత హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆదేశించారు.

గురుకుల పాఠశాల నిర్మాణానికి రెండున్నర ఎకరాలు



విద్యార్థికి ప్లేట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

భాగ్యనగర్‌కాలనీ: గురుకుల పాఠశాల నిర్మాణానికి దూలపల్లిలో మరో రెండున్నర ఎకరాలు భూమి కేటాయించామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. హైదర్‌నగర్‌లోని బాలానగర్ మండల అల్ప సంఖ్యాకుల మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గురుకుల పాఠశాలలో ఐదు నుంచి ఎనిమిదో తరగతికి ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు ఎన్. జితేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంటు మీటర్‌కు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలి

కూకట్‌పల్లి: కరెంటు మీటర్‌కు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలని టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు గురువాం ఓ ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా మీ కరెంటు బిల్లుకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు వస్తుందని తెలిపారు. ఇంకా ఏమైనా కరెంటు సమస్యలు వచ్చినా, పవర్ కట్ అయినా ముందుగా సమాచారం అందుతుందని, వినియోగదారులు తప్పకుండా మీటర్‌కు ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాలని సూచించారు.

నియామకం

కూకట్‌పల్లి: గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సికింద్రాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడిగా దొమ్మటి శివకుమార్‌ను నియమించారు. ఈ మేరకు జాతీయ కోఆర్డినేటర్ ఎస్ వరుణ్‌కుమార్ శివకుమార్‌కు నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని నియోజకవర్గంలో దళితుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అంబేద్కర్ యువజన సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు. పదవి వచ్చేందుకు కృషి చేసిన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సదా మహేశ్, జక్కుల అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



శివకుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న వరుణ్‌కుమార్, కర్క నాగరాజు తదితరులు

నృత్య ప్రదర్శనలో నేషనల్ అవార్డు



ప్రదీక్షను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం, కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసముంటున్న ఆర్‌పి వరలక్ష్మి కుమార్తె ప్రదీక్ష అండమాన్‌లో కూచిపూడి నృత్యం అభినయించి నేషనల్ అవార్డు సాధించింది. ప్రణవి నేతృత్వంలో శ్రీ మానస డాన్స్ ఆఫ్ అకాడమీ తరఫున ప్రదీక్ష కూచిపూడి నేర్చుకుంది. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం ప్రదీక్షను అభినందించారు. కూచిపూడి నృత్యాన్ని దేశవిదేశాలకు వ్యాపించేలా అభినయించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా రూ. 10 వేలు అందించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, వల్లి రమణ పాల్గొన్నారు.